తెగ తాగేశారు..!


కర్నూలు అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ సంబరాలు జోరుగా సాగాయి. అర్ధరాత్రి ఎటు చూసినా బాణసంచాలు కాలుస్తూ యువకులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. కొందరు మాత్రం ఇండ్లకే పరిమితమై ఫుల్‌గా లాగిస్తే, మరికొందరు మాత్రం ఫుల్ కిక్కులో బైక్స్ రైడ్ చేసి పోలీసులకు పట్టుబడ్డారు. న్యూ ఇయర్ ఏమో కానీ, మద్యం కొనుగోళ్లు మాత్రం రికార్డు స్థాయిలో సాగాయి. న్యూ ఇయర్ వేడుకల్లో మందుబాబులు పండుగ చేసుకున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా డిసెంబరు 31 ఒక్క రోజే రూ.11.5 కోట్ల మేర లిక్కర్ అమ్మకాలు జరిగాయి. మద్యం ప్రియులు ముందుగానే పెద్ద ప్లాన్ వేసి, పార్టీలు జోరుగా సాగించారు. అధికంగా బీరు బాటిళ్ల కొనుగోళ్లకు మద్యం ప్రియులు ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. మందుబాబులు రికార్డు స్థాయిలో కొనుగోళ్లు చేయడంతో ఎక్సైజ్ శాఖకు భారీగానే ఆదాయం వచ్చింది.


కర్నూలులోని ఎన్‌ఆర్‌పేటలోని ఓ వైన్‌షాపు దగ్గర గుమిగూడిన మద్యంప్రియులు

- 24 గంటల్లో రూ.11.5 కోట్ల బిజినెస్
- మద్యం దుకాణాలు, బార్లు కిటకిట
- రికార్డు స్థాయిలో లిక్కర్ అమ్మకాలు
- హుషారుగా న్యూ ఇయర్ సంబరాలు

మంగళవారం నూతన సంవత్సర వేడుకల కోసం మద్యం అమ్మకాలను ఎక్సైజ్ శాఖ అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం దుకాణాలను తెరిచేందుకు అనుమతి ఇవ్వడంతో దుకాణాల వద్ద మద్యం కోసం యువత, ఇతర వర్గాలతో కిక్కిరిసి కనిపించింది. రాష్ట్రంలో ఐదేళ్ల తర్వాత కొత్త మద్యం పాలసీ అమలు కావడంతో మందుబాబులకు మద్యం తక్కువ ధరల్లో ఎక్కడ పడితే అక్కడి లభ్యమైంది. కూటమి ప్రభుత్వంలో ధరలు తగ్గడంతో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే మందు బాబులు జిల్లాలోని మద్యం షాపులు, బార్లను ఆశ్రయించారు. ఫలితంగా మద్యం వ్యాపారులు జోరుగా వ్యాపారాలు జగడంతో మద్యం బాబులకు అవసరమైన బ్రాండ్లను అందుబాటులో ఉంచారు. నూతన సంవత్సర వేడుకలు ఘనంగా చేసుకున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి వరకు మద్యం ఏరులై పారింది. మధ్యాహ్నం నుంచే మద్యం దుకాణాల వద్ద క్యూలో నిలబడి మద్యం బాటిళ్లను కొనుగోలు చేస్తూ కనిపించారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది భారీగానే మద్యం అమ్మకాలు జరిపినట్లు ఎక్సైజ్ అధికారుల రికార్డులు చెబుతున్నాయి.





అమ్మకాలతో దుకాణాలు..కిటకిట..

కర్నూలు జిల్లాలో 204 దుకాణాలు, 49 బార్ల ద్వారా రూ. 11.50 కోట్ల మద్యం వ్యాపారం జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లాలో 99 దుకాణాలు, 27 బార్ల రూ.6.30 కోట్ల అమ్మకాలు జరగ్గా, నంద్యాల జిల్లాలో 105 మద్యం దుకాణాలు, 22 బార్ల ద్వారా రూ.5.20 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మద్యం దుకాణాలను కొత్త మద్యం పాలసీలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 204 దుకాణాలు టెండర్ ప్రక్రియ ద్వారా ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకాలను కట్టబెట్టింది. గత ఏడాది అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 192 దుకాణాల ద్వారా మద్యం అమ్మకాలను ప్రభుత్వమే ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి సాగించింది. 2023 డిసెంబరు 31వ తేదీ రూ.7.33 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా ఈ ఏడాది ప్రైవేట్ మద్యం అమ్మకాల ద్వారా భారీ ఎత్తున అమ్మకాలు జరిగాయి. నంద్యాల, ఆదోని, డోన్, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాల్లో కూడా గతంలో కంటే అమ్మకాలు భారిగా జరిగాయి. ఇక బార్లు కూడా కిక్కిరిసి కనిపించాయి. ఉమ్మడి జిల్లాలోని 49 బార్లలో కూడా రాత్రి అమ్మకాలు జోరుగా సాగాయి.

మందుబాబుల హల్‌చల్!

జిల్లాలోని నగరంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో నూతన సంవత్సర వేడుకలను జరుపుకొన్నారు. కర్నూలు నగరంలో మందుబాబులు తప్పతాగి చిందులేశారు. రోడ్లపై బైక్‌లతో చక్కర్లు కొట్టారు. బైక్‌ల సైలెన్సర్లను తొలగించి రైజ్ చేస్తూ భారీ శబ్దాలతో కేకలు వేస్తూ కనిపించారు. బాణసంచా పేలుస్తూ వేడుకలు నిర్వహించుకున్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు పోలీసుల ఆంక్షలు అమలులో ఉన్నప్పటికీ యువత పట్టించుకోలేదు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ నుంచి బళ్లారి వెళ్లే రహదారి, వెంకటరమణ కాలనీ, పాత బస్తీ, నంద్యాల చెక్ పోస్టు పరిధిలోని జోహరాపురం రోడ్డులో యువత చిందులేస్తూ, బైక్‌లపై విన్యాసాలు చేశారు. అయితే పలు చోట్ల ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కొందరు గాయాలపాలయ్యారు.




నగరంలోని ఓ వైన్‌షాపు దగ్గర మద్యం కోసం ఇలా..

మమ్మరంగా వరి కోతలు ..


యంత్రం ద్వారా వరి నూర్పిడి చేస్తున్న రైతులు


వరి కోతలో నిమగ్నమైన మహిళా కూలీలు

కొలిమిగుండ్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌గా మండలంలోని కల్వటాల, నందిపాడు, ఎర్రగుడి, తిమ్మనాయినిపేట, అబ్దులాపురం, కొలిమిగుండ్ల, నాగిశెట్టిపల్లె, నందిపాడు తదితర గ్రామాల్లో సుమారు 1000 ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేశారు. గత కొద్ది రోజుల నుండి వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల తుఫాన్ ముసురు కారణంగా వరి కోతలను నిలిపివేసిన రైతులు, మూడు, నాలుగు రోజులుగా తిరిగి వరి కోతలు ప్రారంభించారు. కొందరు రైతులు వరి కోత యంత్రం ద్వారా పంట నూర్పిడి పనులు చేపడుతుండగా, మరి కొందరు రైతుల మహిళా కూలీల చేత పంట నూర్పిడి పనులు చేయిస్తున్నారు.

కేసీ కాలువలో తగ్గిన నీటి ప్రవాహం

చాగలమర్రి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాజోలి ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువలో 60 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఆనకట్ట పరిధిలో వరి పంట కోత నూర్పిళ్లు చేస్తుండటంతో ఆనకట్ట నుంచి కాలువకు నీరు నిలిపివేశామని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి బుధవారం తెలిపారు. కేసీ కెనాల్ గేట్లను మూసివేసి ఆనకట్టవద్ద కుందూ గేట్లను ఎత్తి కడప జిల్లా వైపు 2200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వెల్లడించారు. రెండో పంటకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగునీరు విడుదల చేస్తామని చెప్పారు. వరి కోతలు ఉండటంతో కేసీ కాలువకు నీరు తగ్గించాలని రైతుల కోరిక మేరకు నీటిని తగ్గించామని చెప్పారు.


కేసీ కాలువలో ప్రవహిస్తున్న నీరు


కాల్వ కింద సాగు చేసిన మొక్కజొన్న పంట

కొత్త ఏడాదిలో ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చుకుందాం

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో (2025) ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చుకుందామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సర వేడుకలు నంద్యాలలో అంబరాన్నంటాయి. టీడీపీ కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ప్రతి వ్యక్తి నడక, నడతలో విజయాన్ని పొందుతూ ముందుకు సాగాలన్నారు.

సీఎం దృష్టికి ప్రజా సమస్యలు
- ఎంపీ బైరెడ్డి శబరి

ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ప్రజా సమస్యలను తీసుకెళతామని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం నంద్యాల టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మంత్రి ఫరూక్‌తో నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించారు.

కొత్త సంవత్సర వేడుకలు

- అర్ధరాత్రి నుంచి ఆనందోత్సాహాల్లో యువత
- ప్రజా ప్రతినిధుల ఇళ్ల వద్ద అభిమానుల సందడి


వెలుగోడులో సంబరాలు చేసుకుంటున్న యువత


మహానందిలో పూజలు చేస్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), జనవరి 1(ఆంధ్రజ్యోతి): తీపి, చేదు జ్ఞాపకాలను మిగిల్చి పెట్టిన 2024కు వీడ్కోలు పలుకుతూ, కోటి ఆశలు, కొంగొత్త ఊసులతో 2025 ఆంగ్లనామ సంవత్సరాన్ని జిల్లా వాసులు ఉత్సాహంగా స్వాగతించారు. కొత్త సంవత్సర ఆరంభ వేడుకలు జిల్లాలో బాగా సందడి చేశాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే వివిధ ప్రాంతాల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. రాత్రి 12 గంటలకు కేక్‌లు కట్‌చేసి, స్వీట్లు పంచుకుంటూ సంబరంగా కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించారు. వేర్వేరు ప్రాంతాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి పది గంటలనుంచి ఆట పాటలతో అర్ధరాత్రి వరకు సంబరాలు నిర్వహించి, అనంతరం కేక్‌లను కట్ చేసి పంపిణీ చేస్తూ 'హ్యాపీ న్యూ ఇయర్...వెల్‌కమ్ న్యూ ఇయర్' అంటూ పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కాగా బుధవారం కొత్త సంవత్సర ప్రారంభాన్ని ఉత్సాహంగా ప్రారంభించారు. ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలు, సామాజిక స్వచ్ఛంద సంస్థలు, యోగ శిక్షణ కేంద్రాల్లో కేక్‌లను కట్‌చేసి, మిఠాయిలు పంపిణీ చేసి ఉత్సాహంగా కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించారు. అయితే భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప దినాల కారణంగా జిల్లా అధికారులు ఈ వేడుకలకు దూరంగా ఉన్నారు. వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల ఇండ్ల వద్ద సందడి కొత్త సంవత్సర ఆరంభ వేడుకల సందడి కనిపించింది. కొత్త సంవత్సరంలో అంతా మంచి జరగాలని కోరుతూ వివిధ దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.


కర్నూలు సమీపంలోని జగన్నాథ గట్టుపై సందర్శకుల సందడి

ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దుతాం: కలెక్టర్

నంద్యాల కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో నంద్యాలను ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయ ఆవరణలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కలెక్టర్ రాజకుమారిని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులతో ఎటువంటి బొకేలు, డైరీలు, పండ్లు, కేక్‌లు అందుకోలేదు. ప్రస్తుతం మాజీ ప్రధాని మన్‌మోహన్‌సింగ్ గతించినందున జాతీయ స్థాయిలో సంతాప దినాలను పార్లమెంట్ సాక్షిగా ప్రకటించారు. అందువల్ల సన్మానాలు, సభలకు ప్రభుత్వ యంత్రాంగం దూరంగా ఉండాలని నిర్ణయించింది. దీంతో ఎలాంటి సభలు, సన్మానాలు నిర్వహించలేదు.


'మూల్యం' నాటికలోని ఒక దృశ్యం

రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు ప్రారంభం

కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బుధవారం రాత్రి రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు 'మూల్యం', 'జనరల్ బోగీలు' సాంఘిక నాటికలను ప్రదర్శించారు. 'ఈ నాటికలు ప్రేక్షకులను ఎంతగానో అలరింపజేశాయి.

7

బీఎస్ఎన్ఎల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జనరల్ మేనేజర్ రమేష్

7

15,458 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం లక్ష్యం

రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు ప్రారంభం



పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న డీఈవో శామ్యూల్ పాల్, సినీ నటుడు సుబ్బరాయశర్మ తదితరులు

కర్నూలు కల్చరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు బుధవారం రాత్రి కన్నుల పండువగా ప్రారంభమయ్యారు. సామాజిక సమస్యలకు దర్పణమే సాంఘిక నాటకమని డీఈవో శామ్యూల్ పాల్ అన్నారు. సినీ నటుడు సుబ్బరాయ శర్మ మాట్లాడుతూ మూడు రోజుల పాటు కొనసాగే నాటకోత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, ప్రతిభ విద్యాసంస్థల అధినేత అరుణాచలం రెడ్డి మాట్లాడుతూ కర్నూలులో చాలా ఏళ్ల తర్వాత సాంఘిక నాటకాలు ప్రదర్శించి ప్రేక్షకులకు వినోదం పంచుతున్నాయని ప్రశంసించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యను అతిథులు, కళాకారులు ఘనంగా సత్కరించారు. సినీ నటుడు గోపరాజు రమణ, కళాక్షేత్రం సభ్యులు మహ్మద్ మియా, ఇనాయతుల్లా, శ్రీనివాసరెడ్డి, రాముడు, సంగా ఆంజనేయులు, యాగంటీశ్వరప్ప పాల్గొన్నారు.

జాతీయ నృత్య ప్రదర్శనల పోస్టరు ఆవిష్కరణ

ఈనెల 10 నుంచి 12 వరకు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనల పోస్టర్లను డీఈవో శామ్యూల్ పాల్, సినీ నటులు సుబ్బరాయశర్మ, గోపరాజు రమణ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కళాకారులు ఆవిష్కరించారు. కూచిపూడి నృత్య గురువు, కార్యక్రమ నిర్వాహకుడు కరీముల్లా మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటునిర్వహిస్తున్నట్లు తెలిపారు.



జాతీయ నృత్య ప్రదర్శనల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అసాంతం అలరించిన నాటికలు

రాష్ట్ర స్థాయి నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రదర్శించిన 'మూల్యం', 'జనరల్ బోగీలు' నాటికలు ప్రేక్షకులను అసాంతం అలరింపజేశాయి. మూల్యం నాటికను సింహప్రసాద్ రాయగా, గోవాడ వెంకట్ దర్శకత్వం వహించారు. హైదరాబాదులోని గోవాడ క్రియేషన్స్ సంస్థ వారు ప్రదర్శించారు. ఈ నాటికలోని ఇతివృత్తం భార్య శరీరంపై భర్తకు సర్వహక్కులు ఉంటాయి, కానీ ఆమెను గుర్తించి గౌరవించకపోవడం చాలా అమానుషమని, మహిళ తన హక్కుల కోసం భర్తను ఎదిరించి న్యాయస్థానంలో తన హక్కులను సాధించుకోవడమే మూల్యమని ఈ నాటిక సందేశాత్మకంగా సాగుతుంది. ఇందులో పాత్రధారులుగా జ్యోతి రాజ్ భీశెట్టి, డాక్టర్ వెంకట్ గోవాడ, శివశంకర భాగిశాస్త్రి, టి. బాలగంగాధర్‌రావు, బి. స్వరాజ్‌కుమార్, ఎ. సంతోష్, సాధూ శ్యామ్‌ప్రసాద్ నటించి మెప్పించారు. రెండో నాటికగా ప్రదర్శించిన 'జనరల్ బోగీలు'ను పీటీ మాధవ్ రాయగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. గుంటూరులోని కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ సంస్థ వారు ఈ నాటికను ప్రదర్శించారు. నాటకంలోని ఇతివృత్తం... రైలుబండిలోని జనరల్ బోగీలన్నీ కిక్కిరిసి ఉంటాయి. ప్రమాదమని తెలిసినా ఫుట్‌పాత్‌లపై నిలబడి ప్రయాణిస్తుంటారు. ఒకవేళ ప్రమాదం జరిగితే ఈ బోగీల్లో ప్రయాణించేవారి వివరాలు రైల్వేవారి దగ్గర ఉండవు. అందువల్ల రైలు ప్రమాదాల్లో మరణించే వారికి కుటుంబాలకు న్యాయం జరగదు. అలా సావిత్రమ్మ అనే మహిళ ఉత్తరాల ద్వారా ఉద్యమం ప్రారంభిస్తుంది. తన కొడుకు రైలు ప్రమాదంలో మరణించాడా లేదా తెలపాలని హైకోర్టును, ప్రజా ప్రతినిధులను ఆశ్రయిస్తారు. తన న్యాయ పోరాటంలో ఆమె కటకటాల పాలవుతుంది. అయినా ఆమె ఉద్యమం మాత్రం కొనసాగిస్తూనే ఉంటుంది. ఈ నాటికలో సురభి ప్రభావతి, ఎం.మధు, కె.నాగేశ్వరరావు, గోపరాజు విజయ్, పి. వినయ్ నటించి మెప్పించారు.

నేడు ప్రదర్శించే నాటికలు

గురువారం సాయంత్రం మొదటి ప్రదర్శనగా గుంటూరులోని అమరావతి ఆర్ట్స్ సంస్థ వారి 'చిగురు మేఘం', రెండో ప్రదర్శనగా గుంటూరుకు చెందిన అభినయాస్ సంస్థ వారి 'ఇది అతని సంతకం' నాటికలు ప్రదర్శిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. కార్యక్రమంలో సినీ, టీవీ నటుడు గోపరాజు రమణని సత్కరిస్తామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరవుతారని ఆయన తెలిపారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● జనరల్ మేనేజర్ రమేష్



కర్నూలు న్యూసిటీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ జనరల్ మేనేజర్ జి.రమేష్ సూచించారు. బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో వినూత్న ఆఫర్లు, సర్వీసులు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 210 ఓఎల్‌టీఈలతో సుమారు 16,400 భారత్ ఫైబర్ కస్టమర్లకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే మిషన్ 20కే నినాదంతో టెలికామ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 346 మొబైల్ టవర్లలో 303 టవర్లకు 4జీ సేవలు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ కె. రాజేశ్వరరావు, ఐఎఫ్ఏడీ శ్రీలత, ఏజీఎం (ఆపరేషన్) శ్రీనివాసరావు, ఏజీఎం (అడ్మిన్) వి.శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

15,458 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం లక్ష్యం

● ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి


కర్నూలు అగ్రికల్చర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో 15,458 హెక్టార్లలో డ్రిప్పు పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడీ మాట్లాడారు. డ్రిప్పు పరికరాల ఏర్పాటు కోసం పెద్ద ఎత్తున రైతులు తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 14,235 మంది రైతులు డ్రిప్పు కోసం దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ 2,618 మంది రైతులకు వారి పొలాల్లో డ్రిప్పు పరికరాలను ఏర్పాటు చేసేందుకు ఆమోదించారని తెలిపారు. 2,139.67 హెక్టార్ల విస్తీర్ణంలో డ్రిప్పు పరికరాలను రైతుల పొలాల వద్దకు చేర్చినట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటల సాగుకు సాగునీరు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీరందరికీ డ్రిప్పు సేద్యాన్ని అలవాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 90 శాతం రాయితీతో డ్రిప్పు పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మార్చిలోపు చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని పీడీ ఉమాదేవి తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

పాణ్యం, జనవరి1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిన్నాపురం పరిధిలో జరిగిన హత్య సంఘటనలో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 1 వతేదీన సోలార్ సంస్థ కార్మికుడు బీహార్‌కు చెందిన మహమ్మద్ సద్దాబ్ పెద్దగా సెల్‌ఫోన్‌లో పాటలు వింటుండగా అదే సంస్థలో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ బహ్రైచ్ జిల్లా షానవాజ్‌పూర్ కాలనీకి చెందిన రామ్‌సాగర్ సాహ్నీ, మిహిపూర్వ టౌన్‌కు చెందిన రాజ్‌కిషోర్, సర్రాకాల గ్రామానికి చెందిన సంత్రామ్ గొడవకు దిగారన్నారు. మహమ్మద్ సద్దాబ్‌పై కర్రతో దాడికి పాల్పడడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. నిందితులపై హత్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో రాజ్‌కిషోర్, సంత్రామ్‌లను 2024 జనవరి 20న అరెస్టు చేసినట్లు తెలిపారు. రామ్‌సాగర్‌సాహ్నీని ఆదివారం ఉత్తరప్రదేశ్ రిషియా పోలీసుస్టేషన్ పరిధిలో అరెస్టు చేసినట్లు తెలిపారు. మంగళవారం నిందితుడ్ని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బాషా, రఫీక్, పోలీసు సిబ్బంది నాగార్జున, గోపాల్ పాల్గొన్నారు.

నంది నాటక పోటీల్లో మార్పు రావాలి

● కర్నూలులో నాటకాలకు ఆదరణ ఉంది
● 300 పైగా చిత్రాల్లో నటించే అవకాశం కలిగింది
● ప్రముఖ సినీ, రంగస్థల నటుడు సుబ్బరాయశర్మ



కర్నూలు కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నంది నాటక పోటీల నిర్వహణ గత ప్రభుత్వ హయాంలో అభాసుపాలైందని, నాటక ప్రదర్శనలకు ముందు స్క్రూటినీ (ముందస్తు పరిశీలన) టెస్టు లేకుండా ఎంపిక చేయడం సరైంది కాదని ప్రముఖ సినీ, రంగస్థల నటుడు సుబ్బరాయ శర్మ అభిప్రాయపడ్డారు. అలాగే కర్నూలులో నాటక ప్రదర్శనలకు మంచి ఆదరణ ఉందని, ఆ నేపథ్యంలోనే తమ సంస్థ ద్వారా మూడు రోజుల నాటక ప్రదర్శనలు టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. అలాగే 300 పైగా తెలుగు చలన చిత్రాలు, వందకు పైగా అనేక టీవీ సీరియళ్లలో నటించానని చెప్పుకొచ్చారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు ఆరంభమయ్యాయి. ఈ సందర్భంగా కర్నూలుకు విచ్చేసిన సుబ్బరాయశర్మ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

● బాలనటుడిగా రంగస్థల ప్రస్థానం ఆరంభం...

నా రంగస్థల ప్రస్థానం 1960లో బాలనటుడిగా ప్రారంభమైంది. థర్డ్‌ఫాం చదువుతున్న నేను 'మొద్దబ్బాయ్' అనే నాటికలో వేషం వేశాను. అలా ఆసక్తి పెరిగి సాంఘిక నాటకాల్లో వివిధ పాత్రలు ధరించేవాడిని. అలాగే 1975లో రేడియో నాటకల్లోనూ వివిధ పాత్రలు పోషించాను. 1977లో టీవీ అందుబాటులోకి వచ్చాక, 'ముచ్చట్లు' అనే పేరుతో తెలుగులో వచ్చే కార్యక్రమంలో నటించాను. తర్వాత ఈటీవీ ప్రారంభమయ్యాక 'శివ లీలలు', బాపుగారి 'శ్రీభాగవతం' వంటి సుదీర్ఘ సీరియళ్లలో నటించారు.

● సినిమాల్లో ప్రవేశం...

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు గారు తమ ఉషాకిరణ్ మూవీస్ నిర్మిస్తున్న 'మయూరి' చిత్రంలో నటించే అవకాశం కల్పించారు. అలా మొదలైన నా సినీ జీవిత ప్రస్థానం ఇప్పటికీ కొనసాగుతోంది. సుమారు 300 చిత్రాల్లో నటించాను. ప్రస్తుత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించే వీరమల్లు చిత్రంలోనూ ఒక పాత్ర ఉంది. అది నిర్మాణంలో కొంత ఆలస్యమవుతోంది. అలాగే సందీప్‌కిషన్ నటిస్తున్న 'మజాకా' చిత్రం త్వరలో ప్రారంభం కానుంది.

● కర్నూలుతో అనుబంధం ఉంది...

ఏపీఎస్ ఆర్టీసీలో అకౌంట్స్ విభాగంలో ఉద్యోగం చేసేవాడ్ని. అలా ఉద్యోగ రీత్యా పదోన్నతిపై 1978లో కర్నూలులో పనిచేశాను. ప్రస్తుత రాజ్‌విహార్ వద్ద ఉన్న ఆర్టీసీ బస్‌స్టాప్ వద్దే మా కార్యాలయం (డీవీసీ - డివిజనల్ వెహికిల్ సెంటర్) ఉండేది. అప్పట్లో ఐదారు డిపోలకు సంబంధించిన వాహనాలకు డీవీసీ కేంద్రంగా ఉండేది. అలా నాటి సాంఘిక నటులతోనే ఇక్కడ పరిచయం ఉండేది. అప్పట్లోనే నాటకాలకు జిల్లాలో మంచి ఆదరణను చూశాను. అది ఇంకా కొనసాగుతూనే ఉండటం సంతోషదాయకం.

● ఒక యజ్ఞంలా ఏటా నాటకోత్సవాల నిర్వహణ...

2018లో నాకు ఇంత ఆదరణ కల్పించిన నాటక రంగానికి ఏదైనా చేయాలనే తలంపు కలిగి, ఏటా రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు నిర్వహించాలనే ఆలోచన కలిగింది. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ నాటక సమాజాలను, కళాకారులను ప్రోత్సహించాలనే తలంపుతో, ఖర్చుకు వెనుకాడకుండా ఏటా జనవరి 1 నుంచి 3 వరకు రాష్ట్రస్థాయి నాటకోత్సవాలను నిర్వహిస్తున్నాను. ప్రతి ఏటా ఒక ప్రాంతంలో నిర్వహిస్తున్నాం. ఇలా గుంటూరు, హైదరాబాదులో రెండుసార్లు, ఏలూరు, ప్రస్తుతం కర్నూలులో జరుగుతున్నాయి. జనవరి 3న నా జన్మదిన సందర్భంగా ఈ నాటకోత్సవాల్లో పేదవర్గాలకు చెందిన ఇద్దరు కళాకారులకు రూ.5వేలు చొప్పున ఆర్థిక సహకారం కూడా అందిస్తున్నా.

● నంది నాటకాలు వైభవం చాటేలా ఉండాలి...

నంది నాటకాలు వైభవం చాటే విధంగా ఉండాలి. ఆనాటి వైభవం నేటి నంది నాటక పోటీల్లో కనిపించడం లేదు. కారణం అనుభవం లేని వారికి నిర్వహణ పట్టం కడుతున్నారు. గత ఏడాదిన గత ప్రభుత్వం నిర్వహించిన పోటీలు వివాదాస్పదం అయ్యాయి. అలాగే స్క్రూటినీ లేకుండా ఎంపిక చేయడం వల్ల నాటక ప్రదర్శనల స్థాయి తగ్గిపోతోంది. అలాగే ప్రాంతాలకు అనుగుణంగా సంఖ్యను ప్రకటించి ఎంపిక చేయడం కూడా తప్పే. ఒక ప్రాంతంలో నాలుగు సమాజాల వారు అర్హులై ఉండొచ్చు. కానీ ఇద్దరినే ఎంపిక చేస్తామనడం సబబు కాదుకదా..అలాగే ప్రతిభ లేని చోట ఉన్న ఇద్దరికీ అవకాశం కల్పించడం కూడా సరైంది కాదు.

విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన లైబ్రేరియన్?

● ఆలస్యంగా వెలుగులోకి ● దేహశుద్ధి చేసిన బంధువులు?

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఓ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని పట్ల ఆ కళాశాలలో పనిచేస్తున్న ఓ లైబ్రేరియన్ అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు కళాశాల లైబ్రేరియన్ దేహశుద్ధి చేయడంతో పాటు ప్రిన్సిపాల్‌పై దాడి చేసినట్లు తెలిసింది. అనంతపురం జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. అక్కడే గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఓ లైబ్రేరియన్ రెండు నెలల క్రితం విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిసింది. దీంతో ఆ విద్యార్థిని తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతూ వచ్చినట్లు సమాచారం. ఇటీవల జరిగిన పరీక్షల్లో ఓ సబ్జెక్ట్‌లో మార్కులు తక్కువగా రావడంతో సంబంధిత అధ్యాపకులు మార్కులు తక్కువ రావడానికిగల కారణాలపై విద్యార్థిని ప్రశ్నించడంతో అసలు విషయం చెప్పినట్లు సమాచారం. అలాగే ప్రిన్సిపాల్‌కు కూడా విషయాన్ని చెప్పడంతో ఆయన లైబ్రేరియన్‌ను పిలిచి మందలించినట్లు తెలిసింది. అయితే ఈ విషయం విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియడంతో వారు బుధవారం కళాశాలకు చేరుకొని జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకొని సదరు లైబ్రేరియన్‌కు దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. ఈ ఘటన జరిగి రెండు నెలలు అయినా ఎందుకు పట్టించుకోలేదని ప్రిన్సిపాల్‌పై చేయిచేసుకున్నట్లు సమాచారం. దీంతో ప్రిన్సిపాల్ ఎడమకంటికి తీవ్ర గాయమైనట్లు తెలిసింది. ప్రిన్సిపాల్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థినిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు. తహసీల్దార్ శేషఫణి, రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు కళాశాలకు వెళ్లి విద్యార్థినులను విచారించారు.

బియ్యం దారి మళ్లలేదు

● గోదాములోనే నిల్వ ఉంచాం
● ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ తిరుపతి రాజు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గత నెల 25వ తేదీన సివిల్ సప్లయ్ సంస్థ డైరెక్టర్ మహేష్‌తో పాటు నంద్యాల సివిల్ సప్లయ్ మేనేజర్ బేతంచెర్లలో తమను ఏ మాత్రం సంప్రదించకుండా బేతంచెర్లలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాములో హడావుడిగా తనిఖీలు చేసి 398 బస్తాల బియ్యం దారి మళ్లాయని నివేదిక ఇచ్చారని, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని బేతంచెర్ల ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ తిరుపతి రాజు స్పష్టం చేశారు. బుధవారం కర్నూలు నగరంలోని ఎస్‌డబ్ల్యూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 27న ఎస్‌డబ్ల్యూసీ రీజనల్ మేనేజర్ షాకీర్ హుశేన్ ఆధ్వర్యంలో తాము బేతంచెర్ల ఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో తనిఖీలు చేపట్టామని, ఒక్క బస్తా బియ్యం కూడా దారి మళ్లలేదని వివరించారు. వాస్తవంగా గత నెల 25వ తేదీన సెలవు ఉండటంతో తాము డ్యూటీలో లేమని రాత్రి సమయంలో సివిల్ సప్లయ్ అధికారులు ఎవరో ఫిర్యాదు చేసినందుకు బేతంచెర్ల గోదాములకు వచ్చి హడావుడిగా తనిఖీలు చేసి నివేదిక తయారు చేయడం జరిగిందని మేనేజర్ తిరుపతిరాజు స్పష్టం చేశారు. మళ్లీ తాము 27న వెళ్లి మూడు గోదాముల్లో తనిఖీలు చేస్తే రికార్డుల్లో నమోదు చేసిన విధంగా బియ్యం బస్తాలు ఉన్నాయని, ఈ విషయాన్ని పూర్తి వివరాలతో జాయింట్ కలెక్టర్‌కు నివేదికను అందజేశామని తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులు కేవలం రెండు గోదాముల్లో మాత్రమే బియ్యం లెక్కించారని, మరో గోదాములో తనిఖీలు చేయకుండా వెళ్లిపోయారని అన్నారు. గోదాముల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో ఫుటేజీని పరిశీలిస్తే ఈ విషయం వెల్లడవుతుందన్నారు.

'5లోపు దరఖాస్తు చేసుకోవాలి'

కర్నూలు కలెక్టరేట్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ పథకం కింద ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా భర్తీ కానున్న జిల్లా రిసోర్స్ పర్సన్ ఉద్యోగాల కోసం ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల సూచించారు. జిల్లాలో మొత్తం 25 డీఆర్‌పీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ప్రతి మండలానికి ఒక డీఆర్‌పీని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. 21 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగిన డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 7288813984, 7032622725 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఇస్తెమా ఏర్పాట్ల పరిశీలన



ఇస్తెమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఏరాసు

ఆత్మకూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ శివార్ల లోని శ్రీశైలం రస్తాలో జనవరి 7,8,9 తేదీల్లో జరగబోవు ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి పరిశీలించారు. ఏర్పాట్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఇస్తేమాకు తరలి వచ్చే ముస్లింలకు ఏలోటు తలెత్తకుండా పగడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కాగా ఇస్తేమా కార్యక్రమాన్ని పురస్కరించుకుని రూ.2 కోట్లు సీఎం చంద్రబాబు కేటాయించడం శుభపరిణామమని అన్నారు. ఈయన వెంట వీఆర్‌కే కన్‌స్ట్రక్షన్ అధినేత రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్షావలి ఉన్నారు.

ఉద్యమాల వేగు చుక్క చిన్నసుబ్బయ్య

ఆత్మకూరు, జనవరి 1: ఆత్మకూరు, నందికొట్కూరు తాలుకాల్లో సీపీఎం నిర్మాణంలో తనవంతు కృషి చేసిన చిన్నసుబ్బయ్య ఉద్యమాల వేగు చుక్క అని నాయకులు ఎ. రాజశేఖర్, ఏసురత్నం అన్నారు. చిన్నసుబ్బయ్య 13వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేసిన తర్వాత 1964లో సీపీఎంగా విడిపోయిన సందర్భంగా పార్టీ అభ్యున్నతికి పాటుపడినట్లు గుర్తుచేశారు. ప్రత్యేకించి వ్యవసాయ కూలీలు, రైతాంగ సమస్యలపై పోరాటాలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రణధీర్, సుధాకర్, సురేంద్ర, రామ్‌నాయక్, షేక్‌ఇస్మాయిల్, భాస్కర్, నాగేశ్వరరావు, స్వాములు, మారెన్న, వీరన్న ఉన్నారు.

చంద్రబాబు హయాంలోనే సాంకేతికాభివృద్ధి

పాణ్యం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు హయాంలో సాంకేతికాభివృద్ధి మరింత ఊపందుకుందని ఆర్జీఎం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు డిగ్రీ పట్టాలతోపాటు తమ నైతిక ప్రవర్తన, క్రమశిక్షణ, ధర్మం వంటివి ఒనగూర్చుకోవాలని కోరారు. 1995లో చంద్రబాబు హయాంలో జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాలలు వెలిశాయన్నారు. ప్రతి ఇంటిలో ఇంజనీరింగ్ విద్యార్థి ఉండాలన్న లక్ష్యంతో కళాశాలల ఏర్పాటు జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్‌లు డాక్టర్ జయచంద్రప్రసాద్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ మధుసూదన్‌చెట్టి, డీన్ రామిరెడ్డి పాల్గొన్నారు.

పేద వితంతువులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న బుగ్గరాముడు

నంద్యాల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని పేద వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. నంద్యాల పట్టణ 38వ వార్డు ఇన్‌చార్జి బుగ్గ రాముడు ఆధ్వర్యంలో మండల పరిధిలోని సుగాలి మెట్టలోని సీఎస్ఐ చర్చిలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. అనంతరం వంద మంది వితంతువులకు చీరలతోపాటు కుక్కర్లు, బెడ్‌షీట్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ నగర్, సుగాలిమెట్టలో పేద వితంతువులకు రూ60,000 వేల విలువ చేసే చీరలు, కుక్కర్లు పంపిణీ చేశామన్నారు. పేదలను ఆదుకోవడం ధర్మ కార్యక్రమాలలో ఒకటని పేర్కొన్నారు.

రబీ పంటలను నమోదు చేసుకోవాలి

బండిఆత్మకూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రైతులు రబీ సీజన్ కింద సాగు చేసిన పంటలను స్థానిక ఆర్బీకేలలో నమోదు చేయించుకోవాలని ఏవో స్వాతి సూచించారు. బుధవారం బండిఆత్మకూరు, శింగవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నారు మడులకు ఎలాంటి చీడ పీడలు సోకకుండా ఉండాలంటే సుడోమోనస్ బయో ఫంగీసైడ్‌తో విత్తన శుద్ధి చేపడితే 20 నుంచి 30 రోజులు ఎలాంటి ఇబ్బందులు రావన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

పాములపాడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన రైతు సురేశ్‌బాబు (43) చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత నెల 27న రైతు సురేశ్‌బాబు ఎద్దుల బండి నుంచి జారీ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, లెనిన్‌బాబు, ఆదిరెడ్డి మోహన్‌గౌడ్, బాలస్వామి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సెల్ ఫోన్ దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ.5 లక్షల ఆస్తి నష్టం

గోసుపాడు, జనవరి (ఆంధ్రజ్యోతి) : గోసుపాడులో సెల్‌ఫోన్ దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగి రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు యజమాని పరదేశి చిన్న బాలన్న తెలిపాడు. మంగళవారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో సెల్‌ఫోన్‌లు, వివిధ ఎలక్ట్రానిక్ సామగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయన్నారు. బ్యాంకు రుణాన్ని పొంది దుకాణం నడుపుకుంటున్నట్టు బాధితుడు తెలిపాడు. బ్యాంకు అధికారులు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించారని చెప్పారు.

బీజేపీ మండల అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

వెలుగోడు జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండల బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజశేఖరరెడ్డిని బుధవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఎన్నికల అధికారి అరవిందరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఎన్నుకున్నారు. రెండోసారి బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్ ఆచారి, నాగేశ్వరరావు, పురుషోత్తం గౌడు, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, తరుపతయ్య మహేశ్ తదతరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఆర్‌డీఏ పీడీ

కల్లూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా నంద్యాల జిల్లా డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను కలిశారు. బుధవారం స్థానిక మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గౌరు దంపతులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఏపీఎం నాగేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.



గౌరు దంపతులకు స్వీట్ బాక్సు ఇస్తున్న నంద్యాల డీఆర్‌డీఏ పీడీ



నంద్యాలలోని రామాలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకారం



మంత్రి ఫరూక్‌కు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



నూతన సంవత్సర సందర్భంగా మంత్రి ఫరూక్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు



ఎంపీ బైరెడ్డి శబరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నంద్యాలవాసులు

ఆనందోత్సాహాల నడుమ

ఆంగ్ల సంవత్సరాది

మహానందిలో నూతన సంవత్సర శోభ

మహానంది, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని వేలాదిమంది భక్తులు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయ కర్పూరాలు సమర్పించారు. అనంతరం నవనందులను దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ. లక్షలాది ఆదాయం లభించిందని ఆలయ అధికారులు తెలిపారు.

ప్రముఖులకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు: నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకొని మహానంది మండలంలోని ప్రజలు పలువురు ప్రముఖులను కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. మండల ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిని మండల టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కలసి ఆయా శాఖల అధికారులకు బొకేలు అందజేశారు.

నంద్యాల కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని పలు ఆలయాలు ప్రజలు దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. పట్టణంలోని సంజీవనగర్ కోదండరామాలయం, బ్రహ్మనందీశ్వర స్వామి ఆలయం, ప్రథమనందీశ్వర స్వామి ఆలయం, నుద్దులపేటలోని శ్రీకృష్ణమందిరము, కాళకాంబ చంద్రశేఖరస్వామి, అమ్మ స్ఫటికలింగేశ్వరాలయం, సాయిబాబా ఆలయం తదితర ఆలయాలను భక్తులు దర్శించారు. సంజీవనగర్ వెంకటేశ్వరునికి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు వట్టివేర్లతో ప్రత్యేక అలంకారం గావించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నూతన సంవత్సరంలో తమకు మంచి జరగాలని లక్ష్మీఅష్టోత్తర గోదాదేవి పూజలు, విష్ణుసహస్రనామం, ధూపదీప నైవేద్యంతో పూజలు నిర్వహించారు. అధికారులు, రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద తమ అభిమానులతో సందడి నెలకొంది. రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు అభిమానులు, ఎంపీ బైరెడ్డి శబరికి తన నివాసంలో కార్యకర్తలు నూతన సంవత్సరం సందర్భంగా పూలదండల బదులుగా పెన్నులు, స్కూల్ బ్యాగులు అందజేశారు. అర్చకులు రాష్ట్ర మంత్రి ఫరూక్‌ను వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఒకరికి ఒకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధిపై రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీఫరూక్‌తో నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి సమావేశమయ్యారు. బుధవారం సాయంత్రం మంత్రి ఫరూక్ కార్యాలయానికి ఎంపీ బైరెడ్డి శబరి వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి, ఎంపీలు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అధిక నిధులు మంజూరుకు కృషి చేద్దాం అన్నారు. ప్రధాన సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొని వెళ్లి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుదాం అన్నారు.

● **నందికొట్కూరు:** నియోజకవర్గంలోని ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. అల్లూరు గ్రామంలో మాండ్ర శివానం దరెడ్డి, ఉమాదేవి దంపతులను, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు తెలిపారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రూర ల్ సీఐ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ బేబి, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ ఏడీఏ విజయశేఖర్, ఏవో షేక్షావలి, నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, పగిడ్యాల తహసీల్దార్ శివరాముడు తదితర అధికారులు నోట్ బుక్కులు, పెన్నులను ఎమ్మెల్యేకు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వర రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటే శ్వర్లు యాదవ్, టీడీపీ నాయకులు షకీల్ అహ్మద్, తదితర నాయకులు ఎమ్మెల్యేకు, మాండ్ర దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● నందికొట్కూరు పట్టణంలో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నివాసంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూల బొకేలు, పూలమొక్కలతో నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, గుణశేఖర్‌రెడ్డి, గోకారి, పగిడ్యాల, జూపాడుబంగ్లా, మిడ్తూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాలకు చెందిన నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మకూరు డీఎస్పీ రామాం జినాయక్, నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్ కుమా ర్‌రెడ్డి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఆయా స్టేషన్‌ల ఎస్ఐలు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నంద్యాల రూరల్: నూతన సంవత్సరంలో దేశ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణ బొమ్మలసత్రంలోని ఆమె స్వగృహంలో కేక్‌కట్ చేసి నూతన సంవత్సర వేడుక లను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీని ఉమ్మ డి జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు కలిసి బొకేలు, జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. మం డలంలోని అల్లూరు గ్రామంలో నూతన సంవత్సర సందర్భంగా మండల వైసీపీ యువ నాయకుడు అల్లంపూర్ రవీంద్ర నాయుడు తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే, మాండ్రల సమక్షంలో టీడీపీలో చేరా రు. ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి లను వైసీపీ నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువాతో ఘనంగా సాన్మానించారు. అనంతరం పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే, మాండ్రలు సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో తిరుమలేష్ నాయుడు, అచ్చన గౌడు, అహ్మద్ బాషా, మాబు సాహెబ్, రాంబాబు, కిరణ్, రామక్రిష్ణ నాయుడు, జయన్నతోపాటు మరి కొంత మంది పార్టీలో చేరారు.

● తెలుగుగంగ ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలుగు గంగ ప్రాజెక్టు చైర్మన్ చెన్నారెడ్డి సంజీవకుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నంద్యాల పట్టణంలోని కార్యాలయంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పగిడ్యాల:మండల పరిధిలోని పగిడ్యాల, బీరవోలు, సంకిరేణిపల్లె, ముచ్చుమర్రి, వనములపాడు, నెహ్రూ నగర్, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘనపురం గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో యువకులు రాత్రి నుంచి సంబరాలు నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి గ్రామాల్లో కేక్ కటింగ్ నూతన సంవత్సర శుభకాంక్షలు తెలియజేశారు. నెహ్రూనగర్ గ్రామంలో టీడీపీ నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం గ్రామాల్లోని నాయకులు, ప్రజాప్రతిధులు, తమ అభిమాన నాయకులకు నూతన సంవత్సర శుభకాంక్షలు తెలియ జేసేందుకు తరలి వెళ్లారు.

● **ఆత్మకూరు:** ఆత్మకూరు పట్టణంలో బుధవారం న్యూఇయర్ వేడుకలు నిరాడంబరంగా జరిగాయి. భారత మాజీ ప్రధానీ మన్మోహన్ సింగ్ మరణాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సంతాపన దినాల సందర్భంగా ఆయా శాఖల అధికారులకు ముందుగా న్యూఇయర్ వేడుకలపై ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలోనే శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సైతం ఇదే కారణాన్ని ప్రస్తావిస్తూ న్యూఇయర్ వేడుకలకు దూరంగా ఉన్నారు. అయితే మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా స్వగృ హంలో న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబుతోపాటు మున్సిపల్ కార్యాలయ అధికారులు వారి స్వగృహానికి చేరుకొని కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్‌కు పుష్పగుచ్ఛం శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు రాజశేఖర్, ఏసురత్నం, రణధీర్ తదితరుల నేతృత్వంలో న్యూఇయర్ వేడుకలు జరిగాయి. ఇదిలావుంటే అంబరారన్నంటేలా న్యూఇయర్ వేడుకలు జరుగుతాయని ఆశించిన స్వీట్స్, పండ్లు, పూల వ్యాపారులు, ఫ్లెక్సీ దుకాణాల నిర్వాహకులు ఈ ఏడాది నిరాశే మిగిలింది. న్యూఇయర్ వేడుకలు చప్పగా సాగడంతో వారంతా నిరుత్సాహపడ్డారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, ఎస్సై నారాయణరెడ్డి తమ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి 9గంటల నుంచే పట్టణంలో పర్యటించారు.

● **బండిఆత్మకూరు:** మండలం అంతటా ఆనందోత్సహాల నడుమ ఆంగ్ల సంవత్సర ప్రారంభ వేడుకలు జరిగాయి. మండల టీడీపీ సీనియర్ నాయకుడు కంచర్ల సురేష్‌రెడ్డి, ఆయన సతీమణి సునీతలకు మండల యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గ రాముడు, మహేశ్‌బాబు దంపతులు, లింగాపురానికి చెందిన షేక్ బాబు, బాషా, సుధాకర్ శాలువాలు కప్పి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల టీడీపీ అధ్యక్షులు నరసింహారెడ్డి, మండల అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి ఇళ్ళ వద్ద నూతన సంవత్సర కోలాహలం కొనసాగింది.

పాములపాడు: పాములపాడులోని జెరుషలేం శాలలో నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం శాల వ్యవస్థాపకులు బ్రదర్ శాంసన్ ఏఫ్రా, పాస్టర్ మణిమాల అమ్మ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రత్యేక ప్రార్ధన లో దాదాపు రెండు వేల మందికి పైగా పాల్గొన్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకొని వివిధ రకాల వేషధారణలు దరించి ఏసుప్రభువు జననం లాంటి ప్రదర్శనలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు.

పాములపాడు: నూతన సంవత్సరం సందర్భంగా తమ ప్రియతమ నేతలను కలిసేందుకు మండలం నుండి టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో బయలు దేరి వెల్లి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నంద్యా ల పార్లమెంటు ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి లను కలిసేందుకు వేంపెంట గ్రామ టీడీపీ నాయకు లు లక్ష్మీకాంతరెడ్డి, లెనిన్‌బాబు, ఆదిరెడ్డి, మోహన్ గౌడ్, బాలస్వామి, రమేశ్‌ల ఆధ్వర్వంలో పది తుఫాన్ వాహనాలు, కార్లలో దాదాపు 150 మంది అల్లూరుకు తరలివెళ్లి స్వీట్లు తినిపించి పూలమాలలు వేసి శుభా కాంక్షలు తెలిపారు. మద్దూరు నుంచి టీడీపీ సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, బానకచెర్ల నుంచిచంద్రశేఖర్, ఎర్రగూడూరు నుంచి నాగార్జునరెడ్డి, వివిధ గ్రామాల నుండి టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు నిర్వహించుకున్నారు.

● **గోసుపాడు:** మండలంలో మంగళవారం న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల టీడీపీ కన్వీనర్ తులసీశ్వరరెడ్డి ఆధ్వర్యలో తేళ్లపురిలో చిన్నపిల్లల మధ్య కేకు కోసి వేడుకలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆశయాలను అనుగుణంగా పని చేస్తుందన్నారు. చంద్రబాబు అనుభవంతోరాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాటంరెడ్డి సుధామణి, నాయకులు పరదేశి బాలన్న, ఈద రమేష్‌యాదవ్, తిరుపతి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్యకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



ఆత్మకూరు సీపీఎం కార్యాలయంలో న్యూఇయర్ వేడుకలు



అమలాపురంలోని సెవెన్త్ డే అడ్వెంటెస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



తేళ్లపూరిలో కేకు కట్ చేస్తున్న టీడీపీ మండల కన్వీనర్ తులసీశ్వరరెడ్డి



బైరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ. రషీద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మున్సిపల్ అధికారులు



నెహ్రూనగర్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



అల్లూరులో మాండ్ర దంపతులకు బొకే ఇస్తున్న ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్



వేంపెంట గ్రామం నుంచి నందికొట్కూరుకు తరలి వెళ్తున్న టీడీపీ నాయకులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

7న మండల సర్వసభ్య సమావేశం

రుద్రవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7న ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బుధవారం ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరై మండల సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి

శిరివెళ్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : యువత ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రావతి అన్నారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన టైలరింగ్, బొటిక్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణా కేంద్రాన్ని ప్రిన్సిపాల్ బుధవారం ప్రారంభించారు. విద్యార్థులు డిగ్రీ చదువుకుంటూనే ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకుని కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండవచ్చన్నారు. అనంతరం కుట్టుమిషన్లను వితరణగా అందజేసిన దాతలు బొగ్గరపు నరసింహయ్య, సుబ్రహ్మణ్యం, జమాలయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు గాయత్రి, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, సిబ్బంది శివ ప్రసాద్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

శిల్పులను స్థపతులుగా నియమించాలి



శిల్పిని సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : శిల్పులను ప్రభుత్వం గుర్తించి దేవాలయాల్లో స్థపతులుగా నియమించాలని విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కోరారు. నంద్యాల రోడ్డులోని శిల్పకళా నగర్‌లో అమర శిల్పి జక్కనాచారి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు, శిల్పిరత్న దురగడ్డ రామకృష్ణమాచార్యులు, కాళికామాత ఆలయ కమిటీ అధ్యక్షుడు దురగడ్డ రవీంద్రాచార్యులు, పలువురు ప్రముఖ శిల్పులను సత్కరించారు. రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతంలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ ఆలయాన్ని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిటీ అధ్యక్షురాలు దురగడ్డ అనురాధ, సభ్యులు విశాలాక్షి, వీరభద్రమ్మ, వెన్నెల పాల్గొన్నారు.

కృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల



శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి పూలమాల వేస్తున్న బలిజ సంఘం నాయకులు

ఉయ్యాలవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఉయ్యాలవాడ గ్రామ బలిజ సంఘం నాయకులు గ్రామంలోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బలిజ సంఘం గౌరవఅధ్యక్షుడు జింకా వెంకటస్వామి, అధ్యక్షుడు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి అర్జిగారి నరసింహుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు చిన్న వెంకటసుబ్బయ్య ఉన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఏఈ

ఉయ్యాలవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఎంపీడీవో ఉమమహేశ్వర రావు అన్నారు. బుధవారం హరివరం గ్రామంలో సీసీ రోడ్డును పీఆర్ ఏఈ వెంకటయ్యతో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ. ఐదులక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రహీమ్, ఇంజనీరింగ్ అసిస్టెంటు రమేష్ ఉన్నారు.

ఎమ్మెల్యే కోట్ల త్వరగా కోలుకోవాలి

- మద్దిలేటి స్వామికి 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్న టీడీపీ నాయకులు



టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బేతంచెర్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆరోగ్యంతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారికి 101 టెంకాయలు బుధవారం కొట్టి కోట్ల అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మొక్కులు చెల్లించారు. అనంతరం మద్దిలేటి స్వామి దేవస్థానంలో కృష్ణవర్దన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి, భీమేశ్వరరెడ్డి, ఎరుకుల చెరువు, సమక్షంలో నూతన సంవత్సర వేడుక లు ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో భవాని వెంకటేశ్వర రెడ్డి, గూటుపల్లె ముల్లా అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, అరుణ్ కుమార్, గోపాల్ రెడ్డి, రామసుబ్బయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎస్సీలకు న్యాయం చేయాలి'

చాగలమర్రి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ జాబితాలో దొర్లిన తప్పులను సరిచేసి తమకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, మండల ఉపాధ్యక్షుడు సంజీవరాయుడు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్‌లకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయాధికారితో న్యాయవాదుల భేటీ

బనగానపల్లె, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఇన్‌చార్జి జూనియర్ సివిల్ న్యాయాధికారి అబ్దుల్ రహిమాన్‌ను బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజాహుసేన్, కార్యదర్శి వెంకటేశం, అల్లావుద్దీన్, రఘురామిరెడ్డి, యూసుఫ్ హుసేన్, అబ్దుల్‌ఖైర్, ఆజాంహుసేన్, సయ్యద్ ఇర్ఫాన్ అబ్బాస్, అఖిల్ విక్రం, జాకీర్‌హుసేన్, భాస్కర్, ముజాహిర్ పాల్గొన్నారు.



బేతంచెర్లలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని కలిసిన ఆర్. కొత్తపల్లి వైసీపీ నాయకులు



డోన్‌లో కోట్ల రాఘవేంద్రరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, అభిమానులు కార్యకర్తలు



డోన్ ఎంఎస్ఆర్ కార్యాలయంలో ధర్మవరం సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- కిటకిటలాడిన నాయకుల ఇళ్లు
- శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు
- చర్చిల్లో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు



కొలిమిగుండ్లలో వైసీపీ కన్వీనర్ అంబటి గుర్విరెడ్డితో కార్యకర్తలు



చాగలమర్రిలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

డోన్ రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డికి వివిధగ్రామాల నుంచి కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంఎస్ఆర్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డిలను అభిమానులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజు స్వగృహంలో అభిమానులు కలిసి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ టీఈ కేశన్న గౌడు స్వగృహంలో అభిమానులు కలిసి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చిన్న మల్కాపురం గ్రామంలో పారిశ్రామికవేత్త, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డిని కలిసి స్థానికులు, అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- డోన్ వైసీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి నియోజకవర్గంలోని పార్టీ అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. నాయకుల ఇళ్ల వద్ద సందడి కనిపించింది.

కొలిమిగుండ్ల : మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంకిరెడ్డిపల్లెలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వర రెడ్డి, నారాయణరెడ్డి, చింతలాయపల్లెలో టీడీపీ సీనియర్ నాయకులు అంబటి జయలక్ష్మీరెడ్డి, నాయకుడు అంబటి వివేకానందరెడ్డికి, కల్వటాలలో సర్పంచ్ కామిని క్రిష్ణారంగారెడ్డి దంపతులకు, కామిని భాస్కరరెడ్డికి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. కొలిమిగుండ్లలో సీనియర్ నాయకుడు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డిని పలువురు నాయకులు, అభిమానులు కలిసి వేడుకలుజరుపుకున్నారు.

- మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో వైసీపీ మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేకు కట్ చేశారు. కోరుమానుపల్లె, అబ్దులాపురం, తిమ్మనాయినిపేట, చింతలాయపల్లె, మదనంతపురం, చెన్నంపల్లె తదితర గ్రామాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు అంబటి గుర్విరెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

రుద్రవరం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మిని ఆ శాఖ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఫారెస్టు కార్యాలయంలో రేంజర్ శ్రీపతినాయుడును కలిసి ఆ శాఖ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు, వైసీపీ నాయకులు కలిసి కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని టీడీపీ, బీసీ సంఘం, పీఆర్టీయూ, ఎస్టీయూ, ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, మైనార్టీసెల్ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరిఫ్, టీడీపీ బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు నివాసాల వద్ద వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్త లు, అభిమానులు, భూమా యూత్ సభ్యులు తరలి వెళ్లి గజమాలలతో సన్మానించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

మండలంలోని ముత్యాలపాడులోని ఎస్పీజీ చర్చిలో డీనరీ చైర్మన్ సంజీవరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చాగలమర్రిలోని ఆర్సీఎం, సీఎస్ఐ, మార్తోమా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, క్రైస్తవులు, మహిళలు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సావిత్రి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభద్ర, ఎస్ఐ వెంకటేష్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, లింగుట్ల వెంకట్‌నాయుడు, డీలర్ రమణయ్య, బొబ్బూరి వెంకటస్వామి, కొత్తపల్లి సురేంద్ర తాళ్లూరి రమేష్‌నాయుడు, సిద్ధి సత్యం తదితరులు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఉయ్యాలవాడ: మండలంలోని ఆయా చర్చిల్లో ప్ర త్యేక ప్రార్థనలు చేశారు. రూపన గుడి గ్రామ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ జోషినతానియేలు కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. మాయలూ రు, అల్లూరు, ఉయ్యాలవాడ, కొం డుపల్లె, ఆర్.పాంపల్లె, హరివరం, పెద్దయమ్మనూరు, కాకర వాడ, ఒంటెద్దుపల్లె గ్రామాల్లో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్య క్రమంలో ఆయా గ్రామాల సం ఘ పెద్దలు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణ కొత్తబస్టాండులోని టంగుటూరు శ్రీనయ్య కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధక్యక్షుడు టంగుటూరు శ్రీనయ్యకు, యాగంటి ఆలయ మాజీ చైర్మన్ తోట బుచ్చిరెడ్డికి వారి కార్యాలయాల్లో పలువురు అభిమానులు, ఆయా పార్టీ నాయకులు పూలమాలలు వేసి శుభాకాంక్షలు అందించారు. అలాగే ఈవోఆర్డీ సతీశ్‌రెడ్డికి గ్రామ పంచాయితీ సిబ్బందితో పాటు పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

గోగిశెట్టి నివాసంలో ..

శిరివెళ్ల: మండల పరిధిలోని వీరారెడ్డిపల్లెలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గోగిశెట్టి నరసింహారావుకు పూలమాలలు వేసి, బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

సంజామల: మండలంలో ఆంగ్ల సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్, ఈవోపీఆర్డీ రాధికా రెడ్డి, ఏవో విజయ్ కుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పలువురు నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అవుకు : టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ. ఉగ్రసేనారెడ్డి కార్యాలయం వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుకొని బొకేలను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ ఒకరినొకరు కలుసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



వీరారెడ్డిపల్లెలో గోగిశెట్టి నరసింహారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



శిరివెళ్ల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు



ఎల్లనాగయ్యకు క్రేన్‌తో గజమాల వేస్తున్న కార్యకర్తలు



రుద్రవరంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



ఉయ్యాలవాడలో ..




చాగలమర్రిలో..



రామాపురంలో ఉగ్రసేనారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ కార్యకర్తలు

యాగంటిలో భక్తుల సందడి

బనగానపల్లె, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు శ్రీ ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్నారు. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. యాగంటి బసవయ్యతో పాటు శ్రీవెంకటేశ్వరగవి, శంకర గవి, బ్రహ్మంగారి గుహలను భక్తులు సందర్శించారు. ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్లను పర్యవేక్షించారు. అలాగు మండలంలోని నందవరం శ్రీచౌడేశ్వరీమాత ఆలయాన్ని భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.



గుహల అందాలను తిలకిస్తున్న పర్యాటకులు



యాగంటిలో వేంకటేశ్వర గవి వద్ద భక్తుల సందడి

సందర్శకులతో కిటకిటలాడిన బెలుం గుహలు

కొలిమిగుండ్ల: బెలుం గుహలు బుధవారం సందర్శకులతో కిటకిటలాడాయి. నూతన సంవత్సరం మొదటి రోజు కావడంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పర్యాటకులు, విద్యార్థులు తరలివచ్చారు. దీంతో గుహల ప్రవేశ రుసుం ద్వారా ఒకే రోజు రూ.1.25లక్షలు సమకూరినట్లు గుహల యూనిట్ మేనేజర్ వెల్లడించారు.

హిందూ సమాజాభివృద్ధికి కృషి చేస్తా



బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండా అశ్వర్థ నారాయణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బేతంచెర్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రజలను చైతన్యపరుస్తూ హిందూ సమాజ అభివృద్ధి కోసం తన సాయశక్తులా కృషి చేస్తానని బీజేపీ పట్టణ కన్వీనర్ గుండా అశ్వర్థనారాయణ శెట్టి అన్నారు. బుధవారం పట్టణంలోని అమ్మవారిశాలలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బీజేపీ పట్టణ అధ్యక్షుడిని సన్మానించారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి, నాగమోహన్, బుగ్గన విశ్వనాథరెడ్డి, న్యాయవాది నందిపల్లె నారాయణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి'

కొలిమిగుండ్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని సీపీఎం నాయకుడు దావీదు డిమాండ్ చేశారు. బుధవారం అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, పుల్లయ్య, రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ క్యాలెండర్ల ఆవిష్కరణ

చాగలమర్రి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) నూతన క్యాలెండర్, డైరీ, స్టిక్కర్లను హెచ్‌ఎం విజయలక్ష్మి, ఏపీయూఎస్ జిల్లా కోశాధికారి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చల్లాకు ఘన నివాళి



చల్లా విగ్రహానికి నివాళులర్పిస్తున్న చల్లా విఘ్నేశ్వరరెడ్డి, కుటుంబ సభ్యులు

అవుకు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చల్లా ఫామ్‌హౌస్‌లో దివంగత ఎమ్మెల్సీ చల్లా రామక్రిష్ణారెడ్డి వర్థంతిని బుధవారం నిర్వహించారు. భార్య చల్లా శ్రీదేవి, పెద్ద కుమారుడు చల్లా విఘ్నేశ్వరరెడ్డి, కూతుళ్లు బృంద, పృథ్వీ, సోదరులు చల్లా స్మారక చిహ్నానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

అభయాంజనేయ స్వామికి పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె రహదారిలో అభయాంజనేయ స్వామికి ధనుర్మాసం సందర్భంగా బుధవారం వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. అభయాంజనేయస్వామికి జల, క్షీరాభిషేకాలు, కలశస్థాపన, రుద్రాభిషేకం చేశారు. చండీహోమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నాపరాతి గనుల్లో దొంగల హల్‌చల్

కొలిమిగుండ్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల నాపరాతి గనుల్లో కాపర్ వైరు దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. నిత్యం ఎదో ఒక గ్రామంలో విలువైన వైర్లు, పైపులు, మోటారు, బెల్టులు ఎత్తుకెళ్తూ గనుల యజమానులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. తాజాగా మీర్జాపురం గ్రామానికి చెందిన గనుల్లో రూ.80వేలు విలువ చేసే వైరు, పైపులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. గ్రామానికి చెందిన రామక్రిష్ణారెడ్డి, బాబు, మరో ఇద్దరి గనుల్లో దొంగతనం జరిగినట్లు బాధితులు తెలిపారు.

అయ్యప్ప స్వామికి గ్రామోత్సవం



అయ్యప్ప స్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు వీఆర్, భక్తులు

కొలిమిగుండ్ల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం కార్యక్రమాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు, పూజలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, వెంకటమల్లారెడ్డి, పెద్దిరెడ్డి, సర్పంచ్ శివశంకర్, ఓబులేషు, ఉప సర్పంచ్ రామలక్ష్మన్న, వెంకటేశ్, చంద్రమోహన్‌గౌడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.